

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
సోమవారం 13 అక్టోబరు 2025



సమ్మెకు సమాయత్తం

నేడు విజయవాడలో విద్యుత్ ఉద్యోగుల ధర్నా
జిల్లా నుంచి భారీగా వెళ్లిన ఉద్యోగులు
ప్రభుత్వం స్పందించకపోతే 15 నుంచి సమ్మె



భీమవరం టౌన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) : దీర్ఘ కాలిక సమస్యల సాధనకై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల ఉమ్మడి కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి సమ్మె చేపట్టేందుకు సిద్ధం అవుతున్నారు. సెప్టెంబరు 15వ తేదీ నుంచి ఆందోళన కార్యక్రమాలను చేపట్టారు.15న నల్లబ్యాడ్జీల నిరసన, 16 నుంచి 18 కు సర్కిల్ కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో ధర్నాలు, 19, 20 తేదీల్లో సర్కిల్ కార్యాలయాల వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. 22న కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన నిర్వహించి వినతి పత్రాలు అందించారు. సమస్యలు పరిష్కారం కాలేదు. ఇటీవల ఉన్నతాధికారులతో నిర్వహించిన చర్చల్లో స్పష్టత రాకపోవడంతో ఇక సమ్మె తప్పదని భావిస్తున్నారు. సమస్యల పరిష్కారంలో భాగంగా కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్నారని జిల్లాల నుంచి దాదాపు 800 మందికి పైగా ఉద్యోగులు పాల్గొనున్నారని విద్యుత్‌శాఖ ఉద్యోగులు తెలిపారు. పరిష్కారం లభించకపోతే 15 నుంచి సమ్మె తప్పదని అంటున్నారు.

డిమాండ్లు ఇవీ

విద్యుత్ ఉద్యోగలకు, పెన్షనర్లకు వారి కుటుంబ సభ్యులకు పూర్తి ఖర్చులు చెల్లించాలి. రాష్ట్ర ప్రభుత్వంలో అమలులో ఉన్న జీపీఎఫ్‌తో కూడిన పెన్షన్ నిబంధనలను ఉద్యోగులందరికి వర్తింప చెయ్యాలి. పది సంవత్సరాలు సర్వీసుదాటిన వారి అందరికి 2018 రివిజన్‌లో మంజూరు చేసిన సర్వీస్ ఇనెసెంటివ్ పునరుద్ధరించాలి. 2014, 18 నూతన వేతనాల్లో అమలు జరిపిన పద్ధతిలో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 ఆగస్టు 13 వరకు ఎరియర్స్ చెల్లించాలి. ఇంకా పలు డిమాండ్ల పరిష్కారానికి ఆందోళన చేస్తున్నారు.



భీమవరం మండలం తుందుర్రులో ఎలుకలు కొరికేసిన సార్వా పంట

ఎలుక తినేసింది..!

ఎకరాకు రెండు బస్తాలు నష్టం

భీమవరం రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది సార్వా సాగులో ఎలుకలు విజృంభించాయి. పంట దిగుబడికి కోత పెట్టాయి. నాట్లు దశ నుంచి ఎలుకల నివారణకు చేసిన రైతుల ప్రయత్నాలు విఫలం అయ్యాయి. జిల్లాలో 2 లక్షల 11 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. వీటిలో లక్ష ఎకరాలపై ఎలుకల దాడి ప్రభావం ఎక్కువగా ఉంది. ఎకరానికి రెండు బస్తాల వరకు నష్టం వస్తుందని రైతులు చెబుతున్నారు. మొత్తం మీద సార్వా సాగులో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఎలుకల పాలైంది. గత ఏడాదికంటే ఈ ఏడాది సార్వా పంట అన్ని ప్రాంతాల్లోను బాగుంది. ఎలుకలు నష్టం లేకుంటే అధిక దిగుబడులు వచ్చేవి. ఎలుకల నివారణకు వేల రూపాయలు ఖర్చుపెట్టినా ఫలితం కనిపించలేదు. ఎలుకలు పట్టేందుకు ఎకరానికి వెయ్యి రూపాయలు రోజుకు ఇచ్చి ఎలుకలు పట్టే బుట్టలు వేయించారు. ఎలుకకు ఒక్క దానికి రూ.100 ఇచ్చి మరీ పట్టించారు. ప్రభుత్వం ఇచ్చిన మందును సామూహికంగా పెట్టారు. ఎలుక బొరియలకు బొరియలు పెట్టారు.అయినా ఎలుకలు చేయాల్సిన నష్టం చేసేశాయి.

ముంపు ఉంటే తగ్గేవి

సార్వా సాగులో అధిక వర్షాల వల్ల వర్షపు నీటి ముంపులు తలెత్తుతాయి. ముంపు వస్తే చేలగట్లు మునిగి గట్టు లోపల, దిబ్బలలో ఉన్న ఎలుకలు చనిపోతాయి. ఈసారి ముంపు పెద్దగా రాలేదు. దీనివల్ల ఎలుకలు పిల్లలు పెట్టాయి. ఎలుక శాతం పెరిగాయి. ముంపు లేనందున వరిచేలు దెబ్బతినలేదు గానీ ఎలుకల నుంచి నష్టం తప్పలేదు.

మూడు బస్తాలు తినేశాయి..



ఈ సార్వా పంటలో ఎలుకలు ఎక్కువ నష్టం చేశాయి. ఎకరం సాగులో 8 సెంట్ల చేనును పూర్తిగా ఎలుకలు పాడు చేశాయి. వేల రూపాయలు ఎలుకలు పట్టేవారికి ఇచ్చినా ఆపలేకపోయాం. మూడు బస్తాలు పంటను పాడు చేశాయి.

- టి.వెంకటరెడ్డి, రైతు, తుందుర్రు

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

తణుకు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా తణుకు డిపో నుంచి పుణ్యక్షేత్రాలకు, విహార యాత్రలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచారామాలకు ఈనెల 26, నవంబరు 2,9,16 తేదీల్లో రాత్రి 7 గంటలకు బస్సులు బయలుదేరి కార్తీక సోమవారం దర్శనాలు అనంతరం తణుకు చేరుకుంటాయని వివరించారు. పూర్తి వివరాల కోసం 73829 03287 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వంకాయ కిలో రూ.100

7

- తగ్గని కూరగాయలు
- కడప ఉల్లి ధమాల్
- పెరిగిన చికెన్





ధాం..ధాం

ఈ ఏడాది టపాసులు పేలేనా ?

మూడేళ్లుగా దీపావళికి వర్షాలు
వాతావరణంపైనే వ్యాపారుల ఆశలు
ఈ ఏడాది 18 శాతం జీఎస్టీ
తగ్గని, పెరగని బాణసంచా ధరలు
రిటైల్‌గా రూ.15 కోట్లపైనే వ్యాపారం

నరసాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ తగ్గడంతో మార్కెట్‌లో ఇంకా పండుగ కళ తగ్గలేదు. అన్ని వస్తువుల ధరలపై పదిశాతం జీఎస్టీ తగ్గడంతో షాపులు ఇంకా కళకళలాడుతున్నాయి. దీపావళి వరకు ఆఫర్లు ఉండటంతో మార్కెట్‌లో జోష్ కొనసాగుతుంది. అయితే అన్ని వస్తువులు తగ్గించినా కేంద్రం దీపావళి బాణసంచా సామాగ్రిపై మాత్రం 18 శాతం జీఎస్టీనే కొనసాగించింది. ఈ కారణంగా గత ఏడాది ధరలే ఇప్పుడు కూడా కొనసాగనున్నాయి. పాత ధరలే ఉండటంతో వినియోగదారులకు కొంత ఊరట లభించింది. ఇటు వ్యాపారులు మార్కెట్‌లో ఉన్న జోష్‌ను చూసి బాణసంచా అమ్మకాల్లో కూడా ఇదే ట్రెండ్ ఉంటుందని ఆశ పెట్టుకున్నారు. అయితే వాతావరణంపైనే ఆందోళన చెందుతున్నారు. పండుగ రెండు రోజులు వర్షం లేకపోతే అమ్మకాలు జోరుగా సాగుతాయన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఏటా అమ్మకాలు రూ.15 కోట్లపైనే..

బాణసంచా అమ్మకాల్లో జిల్లాకు ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. వ్యవసాయ ఆధారిత జిల్లాగా పేరుగాంచిన ఉమ్మడి పశ్చిమలో దీపావళి పండుగను కులమతాలకు అతీతంగా జరుపుకుంటారు. పిల్లల నుంచి పెద్దల వరకు బాణసంచా కాల్చడం సంప్రదాయం. స్తోమతను బట్టి కొనుగోలు చేస్తుంటారు. దానికి అనుగుణంగానే వ్యాపారులు పండుగ రెండు నెలల ముందు నుంచి స్టాక్‌ను నిల్వ చేస్తారు. ప్రస్తుతం జిల్లాలో 80 మందికిపైగా బాణసంచా లైసెన్స్ దారులు ఉన్నారు. వీరిలో కేంద్రం జారీ చేసిన లైసెన్స్ వ్యాపారులు 20 మంది ఉంటే మిగిలిన 60 మంది జిల్లా అధికారులు ఇచ్చిన లైసెన్స్‌దారులు. అత్యధిక దుకాణాలు తణుకు, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో ఉన్నాయి. ఇటు పాలకొల్లు, నరసాపురం, భీమవరంలో కూడా ఏడాది పొడుగునా విక్రయాలు జరిపే హోల్‌సేల్ షాపులు ఉన్నాయి. గతంలో ఈ దుకాణాలు పండుగల సమయంలోనే ఉండేవి. అయితే నేడు పెళ్లిల్లు, అమ్మవార్ల ఊరేగింపులు, ఇతర శుభ కార్యక్రమాలకు కూడా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చడం ఆనవాయితీగా మారింది. దీంతో ఈ షాపుల్లో వ్యాపారం కూడా జోరుగా సాగుతుంది. అయితే పండుగ వ్యాపారంపైనే ఎక్కువగా ఈ వ్యాపారులు ఆశలు పెట్టుకుంటారు. ఈ లైసెన్స్ వ్యాపారులతో పాటు మండల, పట్టణ స్థాయిల్లో తాత్కాలిక లైసెన్స్‌లు పొంది ఏర్పాటు చేసి దుకాణాల సంఖ్య కూడా ఎక్కువ గానే ఉంటుంది. ప్రతి మండలం ఐదు దుకాణాలు తగ్గవు. అయితే పట్టణాల్లో అయితే 30 నుంచి 50 షాపుల వరకు ఉంటాయి. వీరంతా హోల్‌సేల్ లైసెన్స్‌దారుల నుంచి కొనుగోలు చేసి పండుగ రెండు రోజులు విక్రయాలు చేస్తుంటారు. జిల్లా వ్యాప్తంగా 500 షాపులపైనే ఉంటాయి. ఇవన్నీ కలుపుకుని పండగ సమయాల్లో జరిపే వ్యాపారం రూ.15 కోట్లుపైనే ఉంటుందని అంచనా. గతంలో ఇంకా ఎక్కువగా జరిగేవి. అయితే వాతావరణం కలిసి రాక పోవడం వల్ల మూడేళ్లుగా పెద్దగా విక్రయాలు జరగలేదు.



గత ఏడాది ధరలే..

గత ఏడాది పండుగలతో పోల్చుకుంటే ఈ ఏడాది అన్ని వస్తువుల ధరలు తగ్గాయి. దీంతో దీపావళి బాణసంచా ధరలు కూడా తగ్గుతాయని ప్రజలు ఆశించారు. అయితే కేంద్రం తయారీకి వినియోగించే కెమికల్ ధరలు తగ్గించి, బాణసంచాపై మాత్రం గతంలో ఉన్న 18 శాతాన్ని యథాతథంగా ఉంచేసింది. కెమికల్ ధరలు తగ్గడం వల్ల తయారీ ధరలు పెరగలేదు. దీంతో గత ఏడాదిలో ఉన్న ధరలే ఈ ఏడాదీ కొనసాగుతున్నాయి.

కొన్ని బాణసంచా ధరలు ఇలా.. (రూపాయల్లో)

	చిన్నవి	పెద్దవి
కాకరపువ్వొత్తులు	70	100
కలర్ పువ్వొత్తులు	80	120
చిచ్చుబుడ్డి	60	150
తాళ్లు	40	70
షార్ట్స్	270(15)	450 (30)
60 షార్ట్స్	1200	1200
అగ్గిపెట్టెలు	70	180
లక్ష్మీబాంబు	150	300
భూచక్రాలు	90	180
విష్ణు చక్రాలు	90	150
5,000 వాలా	900	1800

10,000వాలా బ్రాండ్ బట్టి రూ.2500 వరకు ఉన్నాయి

వాతావరణంపైనే వ్యాపారం



వ్యాపారమంతా వాతావరణంపైనే ఆధారపడి ఉంది. పండుగ రెండు రోజులు వర్షం లేకపోతే అమ్మకాలు బావుంటాయి. గడిచిన మూడేళ్ల ప్రకృతి కలిసి రాలేదు. దానికి జీఎస్టీ ప్రభావం కూడా అమ్మకాలపై చూపింది.ఈసారి ధరలు పెరగలేదు. దీంతో వ్యాపారం బాగా ఉంటుందని అనుకుంటున్నాం.

యర్రంశెట్టి మోహనరావు,
లైసెన్స్ వ్యాపారి, నరసాపురం

జిల్లాలో వ్యాపారం తగ్గింది



ఒకప్పుడు దీపావళి అమ్మకాలకు జిల్లాలో పెట్టింది పేరు. ఒకరిద్దరు పెద్ద వ్యాపారులు రూ.5 నుంచి రూ.10 కోట్లు మేర పెట్టుబడులు పెట్టి హోల్‌సేల్‌లో తెచ్చేవారు. వారి దగ్గర నుంచి రిటైల్ వ్యాపారులు కొనుగోలు చేసి విక్ర యాలు జరిపేవారు. ఇటీవల కాలంలో వ్యాపారం బాగా తగ్గింది. దానికి ధరలు ఒక కారణమైతే బాణసంచా పొగ వల్ల అనారోగ్యాలు కలుగుతాయన్న భయం ప్రజల్లో నెలకొంది. దీంతో వ్యాపారం క్రమంగా తగ్గుతూ వస్తుంది.

- కొటికలపూడి మారుతీరామ్,
లైసెన్స్ వ్యాపారి, పాలకొల్లు

వ్యాపారాలను దెబ్బతీస్తున్న దందా

గూడెం..హోల్‌సేల్ మార్కెట్‌కు పెట్టింది పేరు
ముడుపులు ముట్ట చెప్పాల్సిందే..
బాణసంచా మార్కెట్‌పైనా అదే పంథా

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెం అంటే హోల్‌సేల్ మార్కెట్‌కు పెట్టింది పేరు. ఏ సరకు అయినా జిల్లాతోపాటు, ఇతర ప్రాంతాలకు ఇక్కడ నుంచే సరఫరా అవుతంటాయి. అటువంటిది ఇటీవల కాలంలో మార్కెట్‌ను దెబ్బతీసే పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. గత ప్రభుత్వంలో తాడేపల్లిగూడెం వర్తక రంగంలో అప్పటి నేతలు వేలు పెట్టారు. వర్తక సంఘాలకు ఎవరు ప్రతినిధులుగా ఉండాలో వారే నిర్ణయించారు. వ్యాపారం ప్రారంభించాలంటే ముడుపులు అప్పగించే సంస్కృతికి తెరలేపారు. అప్పట్లో ఒక్కరే అంతా దండుకునే పరిస్థితి ఉండేది. ఇప్పుడు అక్రమ దందాల్లో అనేకమంది పట్టుకొస్తున్నారు. చిల్లర నుంచి లక్షల దాకా దండుకుంటున్నారు. ఆ ప్రభావం బాణసంచా వ్యాపారంపైనా పడుతోంది. తాడేపల్లిగూడెం నుంచే ప్రతిఏటా కోట్ల రూపాయల్లో బాణసంచా వ్యాపారం నడిచేది. గత ప్రభుత్వంలో వైసీపీ నేత ముడుపులు దండుకున్నారు. షాపులు పెట్టుకోవాలంటే తాడేపల్లిగూడెంలో వ్యాపారులు పెద్దమొత్తంలోనే చెల్లించాల్సి వస్తోంది. దాంతో ధరలు ఎక్కువగా ఉంటున్నాయి. ఫలితంగా తాడేపల్లిగూడెం మార్కెట్ దెబ్బతింటోంది. ఇతర ప్రాంతాలకు మార్కెట్ విస్తరిస్తోంది.తణుకు, పాలకొల్లు, నర్సాపురంలోనూ ఇప్పుడు బాణసంచా మార్కెట్‌కు పేరుపొందుతున్నాయి. పాలకొల్లులో గతేడాది వ్యాపారం జరుగుతున్నప్పుడే అధికారులు వెళ్లి హడావుడి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జిఎస్‌టి 18 శాతం వసూలు చేయాలన్న ఉద్దేశంతో వాణిజ్య పన్నుల శాఖకు చెందిన ఇతర ప్రాంతాల అధికారులు పాలకొల్లులో తనిఖీలు నిర్వహిస్తే అక్కడ తెలుగుదేశం నేత అడ్డుకున్నారు. వ్యాపారాలు జరిగే రోజుల్లో బాణసంచా దుకాణాల్లో కూర్చుంటే ఎలా వ్యాపారాలు చేసుకుంటారంటూ ప్రశ్నించారు. సవ్యంగా వ్యాపారాలు చేసుకునేలా చూడాలని ఆదేశించారు. దాంతో అక్కడ నుంచి అధికారులు - మిగతా 8లో..

బ్రహ్మాండం.. బ్రహ్మోత్సవం

తూర్పు గోదావరి జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు ఆదివారం మంగవాయిద్యాలతో స్వామి వారితో ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. స్వామి వారిని వసంత మండపంలో వేదిక వద్దకు తోడ్కొని వచ్చి వేదపడింతులు, అర్చకులు బ్రహ్మోత్సవ పూజలను నిర్వహించారు. అనంతరం తోమాల సేవ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వస్తివచనం, ప్రధాన హోమాలు, విశేష అర్చన, చతుర్వేద స్వస్తి తదితర కార్యక్రమాలను నిర్వహించారు.



వేద స్వస్తి నిర్వహిస్తున్న అర్చకులు, పండితులు

హమ్మయ్య !



బాదంపూడి రోడ్డుకు మోక్షం
రూ.4.9 కోట్లు మంజూరు
రోడ్డు అధ్వానంతో బైపాస్ మీదుగా బస్సులు
ఐదేళ్లుగా గూడెం వాసుల అవస్థలు

తాడేపల్లిగూడెం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బాదంపూడి నుంచి కొత్త ఫ్లైవర్ వరకు 3.72 కిలో మీటర్ల పొడువన బీటీ రోడ్డు నిర్మించేందుకు రూ.4.9 కోట్లు మంజూరయ్యాయి. వీటికి టెండర్లను పిలవడం పనులు ప్రారంభించడమే మిగలి ఉంది. ఈ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పోరాటమే చేశారు. రోడ్డు పరిస్థితిపై అసెంబ్లీలో లేవనెత్తారు. రోడ్డు పాడవడంతో బస్సులు ఊళ్లోకి రావడం లేదనే విషయాన్ని ప్రస్తావించారు. ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించింది. నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఈ రోడ్డుకు తటిడు మట్టి కూడా వేసిన దాఖలాలు లేవు. కూటమి వచ్చీ రావడంతోనే ఈ రోడ్డుకు పడిన గుంతలను యుద్ధప్రాతిపదికన పూడ్చారు. అయితే ఇటీవల కురిన భారీ వర్షాలకు మళ్లీ గోతులు పడ్డాయి. శాశ్వత ప్రాతి పదికన చేపట్టకపోతే గోతులు పూడ్చినా ప్రయోజనం ఉండదు.రోడ్డు పాడవడంతో ప్రైవేట్ బస్సులు, ఆర్టీసీ లగ్జరీ బస్సులు తాడేపల్లిగూడెం పట్టణంలోకి రాకుండానే బైపాస్ రోడ్డులో వెళ్లిపోతున్నాయి. వైజాగ్, హైదరాబాదు, చెన్నయ్, బెంగళూరు వంటి దూరప్రాంతాలకు వెళ్లేవారు బైపాస్ రోడ్డులో పడిగాపులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. రోడ్డు నిర్మాణం పూర్తిచేస్తే ఈ కష్టాలు తప్పుతాయి.

రూ. 7 కోట్లతో ప్రత్తిపాడు- గూడెం పనులు

ప్రత్తిపాడు నుంచి తాడేపల్లిగూడెం వరకు నాలుగు కిలోమీటర్ల పొడువున రూ.7 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే రోడ్డుకు పడిన గోతులను తొలిదశగా పూడ్చుతున్నారు. గోతులు పూడ్చిన తరువాత శాశ్వత ప్రాతిపదికన పనులు వేగవంతం చేసే దిశగా అర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ రోడ్డు నిర్మాణం కూడా పూర్తిచేస్తే తాడేపల్లిగూడెంలో ప్రధానంగా ఉన్న సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. దీంతో బైపాస్ నుంచి ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు సైతం తాడేపల్లిగూడెం పట్టణంలోకి రావడానికి మార్గం సుగమం అవుతుంది.



పడాల వద్ద రోడ్డు పరిస్థితి

కిరాయిలు దొరుకుతాయి



ఈ రోడ్డు మీదుగా కిరాయికి వెళ్లాలంటే భయమేస్తుంది. ఆటోలు మరమ్మతులకు కూడా వచ్చేవి.. ఇప్పుడు ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేయడం ఆనందంగా ఉంది. తొందరగా రోడ్డు వేస్తే మాకు కిరాయిలు బాగా దొరుకుతాయి. పట్టణలో ఎన్ఐటీ వైపు వెళ్లే రోడ్డు కూడా పాడైంది. దీని నిర్మాణం కూడా చేపట్టాలి.

కె. వెంకటేశ్వరరావు, ఆటో యూనియన్ నాయకుడు

ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నాం



బాదంపూడి నుంచి కొత్త ఫ్లైఓవర్‌బ్రిడ్జి వరకు రోడ్డు అధ్వానంగా మారింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించడం అభినందనీయం. గత ప్రభుత్వం పట్టించు కోలేదు. కేవలం సంక్షేమం పేరుతో దోచుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి చేస్తున్నది.

బడుగు వెంకటేశ్వరరావు,టీపీ గూడెం



పోటీలో తలపడుతున్న పారా స్విమ్మర్లు, విజేతలు

ఉత్సాహంగా పారా స్విమ్మింగ్ పోటీలు

ఏలూరు రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఏపీ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏడవ రాష్ట్రస్థాయి పారా స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు బిశ్వనాథ్ భర్తియా స్విమ్మింగ్ పూల్‌లో ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర గ్రంథా లయ చైర్మన్, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ గొనుగుంట్ల కోటేశ్వరరావు, ఎమ్మెల్యే బడేటి చంటి ఆదివారం పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. క్రీడారంగంలో ప్రతిభ చాటిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించిందన్నా రు. కార్యక్రమంలో యూడ చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థ సారథి, డీఎస్‌డీవో బి.శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ పూజారి నిరంజన్, విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమ శాఖ ఏడీ బి.రామ్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలో రాష్ట్రవ్యాప్తంగా 120 మంది పారా క్రీడాకారులు పాల్గొన్నారు. తమ సత్తా చాటి పతకాలు సాధించారు. స్విమ్మింగ్ కోచ్ బండ్ల గణేశ్ పర్యవేక్షించారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, వేద పండితులు

మద్ది క్షేత్రంలో హనుమద్ హోమం

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గురవాయిగూడెం మద్ది అంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం హనుమద్ హోమం ఆలయ అర్చకులు, వేద పండితులు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నట్లు ఈవో ఆర్‌వి.చందన తెలిపారు. ప్రతీ ఆదివారం హనుమద్ హోమం నిర్వహిస్తున్నట్లు చందన తెలిపారు.



మండలపు రవిని సత్కరిస్తున్న టీడీపీ నేతలు

మండలపు రవికి ఆత్మీయ సత్కారం

ఏలూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ రాష్ట్ర చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన టీడీపీ నేత మండల రవికి హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో పలువురు టీడీపీ నేతలు ఆదివారం ఆత్మీయ సత్కారం చేశారు. ఆయన భవిష్యత్‌లో మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మండలపు సాయిబాబా చౌదరి, వంగవోలు కృష్ణప్రసాద్, మండలపు మోహన్, మండలపు జగదీష్, దండా బుచ్చిబాబు, ఇనగంటి శ్రీనివాసరావు, మండలపు వీరభద్రరావు ఘనంగా సత్కరించారు.

వంకాయ కిలో రూ.100

- తగ్గని కూరగాయలు
- కడప ఉల్లి ధమాల్
- పెరిగిన చికెన్

తాడేపల్లిగూడెం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో వంకాయల ధరలు ఆకాశాన్నంటాయి. గత వారం కిలో రూ.60 ఉన్న ధర ఆదివారం రూ.వంద పలికింది. దసరా శరన్నవరాత్రులు వెళ్లిన తరువాత కూరగాయల ధరలు తగ్గుతాయని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. బెండకాయలు కిలో రూ.30, బీరకాయలు రూ.50, దొండకాయలు రూ.40, కాకర రూ.50, ఆగాకర రూ.120, కార్యరెట్ రూ.60, బీట్‌రూట్ రూ.60, చిక్కుళ్లు రూ.120, టమాటా రూ.40, పచ్చిమిర్చి రూ.60 ధరకు విక్రయిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సిద్దాంతం, ఖండవల్లి, కొయ్యలగూడెం, లింగారాయుడుగూడెం, జగ్గన్నపేట, వెంకట్రామన్నగూడెం, లింగపాలెం, కన్నాపురం, పోలవరం, బుట్టాయిగూడెం, పెదవేగి ప్రాంతాల్లో విస్తారంగా కూరగాయల తోటలు వేశారు. ఇటీవల వర్షాలకు తోటలు దెబ్బతిన్నాయి. దీంతో కూరగాయలకు ఇప్పుడు ఇతర ప్రాంతాలపై ఆధారపడాల్సి వస్తుంది.

కడప ఉల్లి పతనం

మార్కెట్లో కడప ఉల్లి ధర పతనమైంది. తాడేపల్లిగూడెం మార్కెట్‌కు 6 లారీలో కడప ఉల్లి వచ్చింది. దీని ధర క్వింటా రూ.500 నుంచి రూ.1000 మధ్య విక్రయాలు జరిగిగాయి. ఉల్లి నాణ్యత లేకపోవడంతో ధర తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు. మహారాష్ట్ర నుంచి 10 లారీల ఉల్లి వచ్చింది. దీన్ని క్వింటా రూ.1200 నుంచి రూ.1800 మధ్య విక్రయాలు జరిగాయి. ఇక రిటైల్ వ్యాపారులు రూ.100కు నాణ్యమైన ఉల్లి నాలుగు కిలోలు, మధ్య, నాసిరకం కలిపి ఉల్లి రూ.100కు 5 నుంచి 6 కిలోల వంతున అమ్మారు.

పెరిగిన చికెన్ ధర

తణుకు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): చికెన్ ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. వారం రోజుల నుంచి ధర పెరుగుతోంది. కేజీ స్కిన్ లెస్ రూ.240 నుంచి



రూ.280 వరకు పెరిగింది. ఆదివారం మార్కెట్లో స్కిన్ లెస్ కేజీ 260 నుంచి రూ.280 ధరకు విక్రయించారు. కొన్నిచోట్ల ఇంకా తక్కువగా కూడా అమ్ముతున్నారు. స్కిన్‌తో రూ. 240 ధరకు అమ్ముతున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో ధరల్లో వ్యత్యాసం కనబడింది. షాపులు అద్దె, నిర్వహణ ఉన్న చోట ఒకలా, చిన్న షాపులు, గ్రామాల్లో నిర్వహణ పెద్దగాలేని చోట మరోలా ధరలు ఉన్నాయి.

జీఎస్టీ భారం!

సడలింపులు లేకుండా మందుల విక్రయం

మూడు దుకాణాలపై కేసు

ఏలూరు అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ సడలించినా కొందరు వ్యాపారులు ధర తగ్గించడం లేదు. పాత జీఎస్టీ ప్రకారమే మందులను విక్రయిస్తున్న చింతలపూడిలో రెండు, ఏలూరులో ఒక మందుల షాపు నిర్వాహకులపై అధికారులు కేసులు నమోదు చేశారు. జిల్లా ఔషధ నియంత్రణశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కళ్యాణచక్రవర్తి ఆదివారం వివరాలు తెలిపారు. చింతలపూడిలో 8 దుకాణాల్లో అధికారులు తనిఖీ చేశారు. విన్‌కేర్ షాపు, మరో దుకాణం, ఏలూరులోని స్వాతి మెడికల్స్‌లో ఉల్లంఘనలు జరిగినట్టు గుర్తించామన్నారు. ఔషధ ధరలకు సంబంధించి 18, 12 శాతం శ్లాబ్‌లలో ఉన్న మందులను 5శాతం శ్లాబ్‌లోకి తీసుకువచ్చారని, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన మందులకు పూర్తిగా జీఎస్టీని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు మినహాయించాయన్నారు. దీనికి భిన్నంగా కొన్ని దుకాణాల యజమానులు ఔషధ విక్రయాల బిల్లింగ్ ప్రాసెస్‌లో సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసుకోకుండా వినియోగదారుల నుంచి పాత జీఎస్టీనే వసూలు చేస్తున్నాయని, ఇటువంటి ఉల్లంఘనలకు పాల్పడినవారిపై కేసులు నమోదు చేశామన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా అన్ని మందుల దుకాణాల్లో తనిఖీలు కొనసాగుతాయని, పాత జీఎస్టీని వసూలు చేసేవారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. వినియోగదారులు కొనుగోలుచేసిన ప్రతీ ఔషధానికి తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని, ఔషధాలకు సంబంధించి జీఎస్టీ ఉల్లంఘనలపై ఫోన్ నంబరు 94910 63158కు ఫిర్యాదుచేయాలని కోరారు. ఆకస్మిక తనిఖీల్లో జంగారెడ్డిగూడెం, తణుకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఉరి వేసుకున్న యువతి

మృతిపై అనుమానాలు

దెందులూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని అనుమానాస్పదస్థితిలో యువతి మృతి చెందింది. మండలంలోని సానిగూడెంలో నేతల నీలమణి(19) భర్త, అత్తతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో చీరతో ఉరివేసుకుని ఇంట్లోనే మృతి చెంది ఉంది. భార్యాభర్తల గొడవల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని భావిస్తున్నారు. భర్త ఫిర్యాదుతో పోలీ సులు కేసు నమోదు చేసి మృతికి గల కారణాలను విచారిస్తున్నారు. కేసును అన్ని కోణాల్లో విచారిస్తున్నట్లు ఎస్ఐ శివాజీ తెలిపారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకొన్న గంజాయి

గంజాయి రవాణా.. ఇద్దరు అరెస్టు

తణుకు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎక్సైజ్ అధికారులు సోదాల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని ఆదివారం అరెస్టు చేశారు. ఉండ్రాజవరం సెంటర్ నుంచి పాలంగి రోడ్డులో ఎక్సైజ్ అధికారులు తనిఖీ నిర్వహిస్తుండగా స్కూటీలో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిగని గుర్తించారు. వారి నుంచి 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డి చెప్పారు. నిందితులను పైడిపర్రు, మండపాక గ్రామానికి చెందిన వారుగా గుర్తించామన్నారు. ముగ్గురిలో పరారైన పోలవరపు కుమార్ శివ పట్టుబడిన మీసాల ఈశ్వరరావు, చీలి వినయ్‌కు గంజాయి సరఫరా చేస్తున్నాడు. గంజాయిని చిన్న ప్యాకెట్లుగా చేసి పట్టణ పరిసరాల్లో విక్రయిస్తున్నట్ల దర్యాప్తు తేలిందన్నారు. కేజీ గంజాయి రూ.3వేలు చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ. 15 వేలు ఉంటుందన్నారు. గంజాయి నిల్వ, రవాణా, అమ్మకాలు సమాచారాన్ని 94409 02436 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

కాలువలో బాలుడి గల్లంతు



తణుకు రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పైడిపర్రులో కాలువలో మునిగి బాలుడు గల్లంతయ్యాడు. దెందులూరు మండలం పోతునూరు గ్రామానికి చెందిన బొమ్మన బోయిన శ్రీఆంజనేయులు తణుకులో ఒక పరిశ్రమలో పని చేస్తున్నాడు. అతడి కుమా రుడు జోగేంద్ర నందు (13) ఆదివారం పైడిపర్రు వంతెన వద్ద గల కాలువ రేవులో ఆదివారం మధ్యాహ్నం స్నానం చేస్తుండగా మునిగిపోయాడు. తణుకు రూరల్ పోలీసులు బాలుని ఆచూకీ కోసం కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

భీమడోలు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మోటారుసైకిల్‌ను లారీ ఢీకొనడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు భీమడోలు మండలం ఆగడాల లంక గ్రామానికి చెందిన సిరంగి మోహనరావు (40) మోటార్ సైకిల్‌పై గుండుగొలను వెళుతుండగా వడ్డిగూడెం సమీపంలో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోహనరావు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై మృతదేహం

ఏలూరు క్రైం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రైలుపట్టాల వద్ద గుర్తు తెలియని యువకుని మృతదేహం ఉందని రైల్వే పోలీసులకు ఆదివారం ఉదయం సమాచారం అందింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ పి.శ్రీనివాస్ తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్లూరు రైల్వే బ్రిడ్జి కింద రైలుపట్టాలపై మృతి చెంది ఉన్నాడు. సుమారు 30 ఏళ్ల వయసు, 5.5అడుగుల ఎత్తు, గోధుమరంగు ప్యాంటు, నలుపుతెలుపు చారల షర్టు ధరించి ఉన్నాడు. తలకు లోతైన గాయంల్ల, కాలు, చేయి విరుగడంతో మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా గుర్తించారు. రైలు నుంచి జారిపడ్డాడా. రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదం జరిగిందా అని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యుదాఘాతంతో గాయపడి..

కామవరపుకోట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఆడమిల్లిలో ఈనెల 4న వ్యవసాయ పొలాల్లో విద్యుత్ స్తంభంపై పనులు నిర్వహిస్తుండగా హెల్పర్ బోణాల వంశీ(22) విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి విజయవాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆదివారం అంత్యక్రియలు పూర్తయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

ఏలూరు క్రైం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌పై వెళుతున్న వ్యక్తి అదుపు తప్పి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం ప్రత్తికోళ్లలంక గ్రామానికి చెందిన ఘంటసాల సోమరాజు (44) ఈనెల 6న ఉదయం కొల్లేరులో చేపల వేట ముగించుకుని మోటారు సైకిల్‌పై వెళుతుండగా అదుపు తప్పి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిని అతడిని ఏలూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాణసంచా అక్రమంగా నిల్వ ఉంచిన వ్యక్తి అరెస్ట్

ఏలూరు క్రైం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బాణసంచా అక్రమంగా నిల్వ ఉంచిన వ్యక్తి ని ఏలూరు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. మాదేపల్లిరోడ్డులోని మహ్మద్ నజీర్ (43) బాణసంచా సామగ్రిని అక్రమంగా నిల్వ ఉంచారు. తారాజువ్వలు, 500 వాలాస్, సుమారు రూ.50,700 పలు రకాల బాణసంచా నిల్వ ఉంచారు. ఎలాంటి అనుమతులు లేవు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ బి.నాగబాబు తన సిబ్బందితో ఆదివారం దాడి చేసి మహ్మద్ నజీర్‌ను అరెస్టు చేశారు. అతడి వద్ద ఉన్న మందు గుండు సామగ్రిని సీజ్ చేశారు.

తరలెళ్లిపోతున్న పల్లె జనం

(మొదటి పేజీ తరువాయి)



వలస వెళ్తున్న పిల్లలకు వీడ్కోలు పలుకుతున్న వృద్ధులు

50 నుంచి 100 కుటుంబాలకు పైగా ఇప్పటికే ఊరు వదిలి వెళ్లారు. ముఖ్యంగా తెలంగాణలోని మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాలకు, ఏపీలోని గుంటూరు జిల్లాకు వెళ్తున్నారు. మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆలూరు, ఆదోని, కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల నుంచి ఇప్పటికే పది వేల కుటుంబాలు పొట్టచేత పట్టుకొని సుగ్గి బాటన సాగిపోయి ఉంటారని అనధికారిక అంచనా. దీంతో గ్రామాలన్నీ బోసిపోతున్నాయి. తల్లిదండ్రులతో పిల్లలు కూడా వెళ్లడంతో పాఠశాలల్లో హాజరు తగ్గిపోతోంది.

కిలో పత్తి తీస్తే రూ. 15

కర్నూలు జిల్లాలో 5.62 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అత్యధికంగా పత్తిసాగు చేసిన జిల్లాల్లో గుంటూరు తర్వాతి స్థానం దీనిదే. అయితే అధిక వర్షాలకు తేమ ఎక్కువై చెట్టుపైన కాయలు నల్లగా మారి కుళ్లిపోయాయి. ఉన్న అరకొర పత్తి చెట్టుపైనే మొలకలొచ్చి నేలపాలయింది. ఎకరాకు నాలుగైదు క్వింటాళ్లకు పైగా దిగుబడి రూపంలో నష్టపోయామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పెద్ద రైతులు పత్తితీత పనులకు పిలిచినా రూ. 300-400 మించి కూలి ఇవ్వడం లేదు. ఆరు నెలలుగా ఉపాధి హామీ కూలి డబ్బులు అందకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణ భారం అవుతుండటంతో వలసబాట పట్టారు. మహబూబ్‌నగర్, వికారాబాద్, గుంటూరులో కిలో పత్తి తీస్తే రూ. 15 నుంచి రూ. 18 చొప్పున ఇస్తున్నారు. 'దంపతులిద్దరూ రోజుకు వంద కిలోల పత్తి తీస్తే రూ. 1,500 వస్తుంది. ఇద్దరు పిల్లలు కూడా పనిలోకి వెళితే మరో రూ.వెయ్యి సంపాదించవచ్చు. ఇలా రోజుకు సుమారు రూ. 2,500, నెలంతా కష్టపడితే దాదాపు రూ.50 వేల నుంచి 60 వేలు సంపాదించుకోవచ్చని వలస బాట పట్టారు. గుంటూరు జిల్లాలో పత్తి తీత పనులు అయిపోగానే మిరప కోత పనులు మొదలవుతాయి. నాలుగైదు నెలలు పనులు ఉంటాయని ఆ జిల్లాకు ఎక్కువ వెళ్తున్నారు.

ఆ ప్రాజెక్టులు పూర్తి చేస్తేనే..

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో వలసల నివారణే ప్రధాన లక్ష్యంగా 2019లో నాడు టీడీపీ ప్రభుత్వం వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. తుంగభద్ర నదిపై 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి నిధుల మంజూరుకు ఉత్తర్వులు ఇచ్చింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పనులను అటకెక్కించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో ఈ ప్రాజెక్టులకు మోక్షం లభిస్తుందని రైతులు ఆశించినా ఇప్పటి వరకూ పనుల్లో కదలికలేదు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం పల్లెసీమల వలసలకు అడ్డుకట్ట వేయాలంటే ఈ మూడు ప్రాజెక్టుల నిర్మాణమే ఏకైక పరిష్కార మార్గమని రాయలసీమ సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు.

ఆరెకరాలున్నా.. వలస బాటే

చింతకుంటకు చెందిన పుసులు యల్లప్ప, పద్మ దంపతులకు బోరుబావి కింద ఆరెకరాల పొలం ఉంది. 3 ఎకరాల్లో పత్తి, మరో 3 ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. రూ.4 లక్షలకు పైగా అప్పు చేశారు. ధరలు పతనమవడంతో ఉల్లి పంటను పొలంలోనే వదిలేశారు. అధిక వర్షాలకు పత్తికూడా పాడైపోయింది. పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక బడికి వెళ్లే ఇద్దరు పిల్లలను తీసుకొని వికారాబాద్‌కు వలస వెళ్తున్నానని యల్లప్ప చెప్పాడు.

యూజ్‌లెస్ ఫెలో.. ఎవడ్రా నువ్వు!

- ఎమ్మెల్యే బూర్లపై నోరు పారేసుకున్న మాల మహానాడు నేత గోళ్ల
- తురకపాలెం మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ



ఎమ్మెల్యే బూర్లకు వేలు చూపిస్తూ మాట్లాడుతున్న గోళ్ల అరుణ్‌కుమార్

గుంటూరు(తూర్పు), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ప్రత్తిపాడు ఎమ్మెల్యే, మాజీ ఐఏఎస్ అధికారి బూర్ల రామాంజనేయులును మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్ కుమార్ అసభ్య పదజాలంతో దూషించారు. తురకపాలెంలో వరుస మరణాల నేపథ్యంలో ఆదివారం ఆయా కుటుంబాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఈ ఘటన జరిగింది. ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మొత్తం 28మందికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమక్షంలో బాధితులకు ఎమ్మెల్యే చెక్కులు పంపిణీచేశారు. ఈ సాయం ప్రభుత్వం చేస్తోందని, దళారులు డబ్బులు అడిగితే ఇవ్వద్దని సూచించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న అరుణ్ కుమార్ ఎమ్మెల్యేను చూస్తూ అంత దౌర్భాగ్యం తమకు రాలేదన్నారు. ఒక సమయంలో నియంత్రణ కోల్పోయి ఎమ్మెల్యే వైపు వేలు చూపిస్తూ 'ఎవడ్రా నువ్వు.. యూజ్ లెస్ ఫెలో' అంటూ దూషించడంతో పాటు తిట్లపర్వం అందుకున్నారు. ఈ ఘటనతో కేంద్ర మంత్రి, అధికారులు షాకయ్యారు. ఎమ్మెల్యే మీదకు దూసుకువచ్చిన అరుణ్‌కుమార్‌ను పోలీసులు తీసుకువెళ్లి పోయారు. ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాలమహానాడు నాయకులను గ్రామస్థులు అడ్డుకున్నారు. మా ఊళ్లో మీ పెత్తనం ఏమిటని నిలదీశారు. కాగా, కొందరు బాధితులు తమకూ ఆర్థిక సాయం ప్రకటించాలని కోరారు.

డిజిటల్ ప్లంబింగ్‌తో విస్తృత పెట్టుబడులు

- బెంగళూరుతో పోటీ పడేలా విశాఖ అభివృద్ధి
- 'ఆంధ్రజ్యోతి'తో సిఫీ చైర్మన్ రాజు వేగేశ్న

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



"డిజిటల్ ప్లంబింగ్"తో విశాఖపట్నానికి విస్తృత స్థాయిలో విదేశీ పెట్టుబడులు వస్తాయని సిఫీ టెక్నాలజీస్ చైర్మన్ రాజు వేగేశ్న తెలిపారు. రుషికొండ ఐటీ పార్కులో ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌కు ఆదివారం శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. విశాఖ కాస్మోపాలిటన్ నగరమని, ప్రస్తుతం ఐటీలో ద్వితీయ శ్రేణి (టైర్-2) నగరంగా ఉందని, త్వరలో ప్రథమ శ్రేణి నగరాలతో పోటీ పడుతుందని చెప్పారు.

ప్రశ్న: డిజిటల్ ప్లంబింగ్ అంటే..?

రాజు వేగేశ్న: సముద్రం అంతర్భాగం నుంచి తీసుకువచ్చే సబ్‌మెరైన్ కేబుళ్లతో విశాఖలోని సిఫీ ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌ను అనుసంధానం చేస్తాం. ప్రపంచంలో ఎక్కడెక్కడో ఉన్న సమాచారాన్ని ఇక్కడికి తీసుకొస్తాం. అవసరమైన రాష్ట్రాలకు, దేశాలకు పంపిస్తాం. ఇలా డేటాని పంపింగ్ చేయడాన్ని 'డిజిటల్ ప్లంబింగ్'గా వ్యవహరిస్తాం. ఇందులో విశాఖ అగ్రస్థానంలో నిలవనుంది. డిజిటల్ ప్లంబింగ్ వల్ల మరిన్ని డేటా సెంటర్లు వస్తాయి. త్వరలోనే ఒక గిగావాట్, రెండు గిగావాట్ సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లు ఏర్పాటవుతాయి. విదేశీ పెట్టుబడులు వస్తాయి. ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందుతుంది.

భారీగా ఉద్యోగాలు వస్తాయా?

ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు ఎలాగైతే ఇంజనీర్లను, డాక్టర్లను తయారు చేసి సమాజానికి అందిస్తున్నాయో.. డేటా సెంటర్లు కూడా ఆ విధంగానే పనిచేస్తాయి. వీటి వల్ల ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు తక్కువగా ఉన్నా.. పరోక్షంగా ఎకో సిస్టమ్ అభివృద్ధి చెంది పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుంది. ఐటీలో అగ్రస్థానంలో ఉన్న బెంగళూరుతో పోటీ పడేలా విశాఖ ఎంతో అభివృద్ధి సాధిస్తుంది.

ఈ రంగంలో మీకున్న అనుభవం ఏమిటి?

భారత్‌లో 25ఏళ్ల క్రితమే డేటా సెంటర్లను సిఫీ ప్రారంభించింది. ముంబైలో 250 మెగావాట్లు, నోయిడాలో 130 మెగావాట్లు, చెన్నైలో మరో 130 మెగావాట్ల డేటా సెంటర్లు నిర్వహిస్తున్నాం. నాస్డాక్‌లో నమోదైన రెండు కంపెనీల్లో ఒకటి ఇన్ఫోసిస్ అయితే రెండోది సిఫీ. డేటా సెంటర్ ఆపరేషన్లు రెండేళ్లలో ప్రారంభించాలనే లక్ష్యంతో విశాఖ వచ్చాం. నేనూ ఏపీకి చెందినవాడినే. మంత్రి లోకేశ్ చాలాకాలం నుంచి తెలుసు. విశాఖ కాస్మోపాలిటన్ నగరం. ఇక్కడ అన్ని ప్రాంతాల వారు ఎటువంటి భేదభావాలు లేకుండా కలిసి మెలిసి ఉంటారు. ఇక్కడ అందమైన బీచ్‌లు ఉన్నాయి. పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. వీటన్నింటి కంటే మంచి పాలసీలు, పూర్తి సహకారం అందించే ప్రభుత్వం ఉండటం వల్లనే ముందుకొచ్చాం.

హైదరాబాద్‌కు దీటుగా విశాఖ

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. అనంతరం రుషికొండ ఏ-1 కన్వెన్షన్ సెంటర్‌లో సిఫీ ప్రతినిధులు ఏర్పాటు చేసిన సమావేశాన్ని లోకేశ్ జ్యోతి వెలిగించి ప్రారంభించి, ప్రసంగించారు. గత 17 నెలల్లో రాష్ట్రానికి 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాగా అందులో 50శాతానికి పైగా విశాఖ జిల్లాకే వచ్చాయని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు భారీగా రావడం ఇదే మొదటిసారని, ఇదంతా ఒక్కరోజులో సాధ్యం కాలేదని చెప్పారు. సుదీర్ఘ చర్చలు, అనేక మంది కీలకంగా వ్యవహరించడం వల్లనే వచ్చాయన్నారు. సిఫీ సంస్థను ఏపీకి రప్పించడానికి ఎనిమిదేళ్లు పట్టిందన్నారు. రాష్ట్రానికి విశాఖపట్నమే ఆర్థిక రాజధాని అని, అభివృద్ధి విషయంలో వికేంద్రీకృత విధానం అనుసరిస్తున్నామని చెప్పారు. ఈ ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందులో ఒక్క విశాఖలోనే 5లక్షల ఐటీ ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. టీసీఎస్‌కు ఎకరా భూమి 99 పైసలకే ఇస్తే విమర్శించారని, అయితే ఆ నిర్ణయం కారణంగా కాగ్నిజెంట్, యాక్సెంచర్, ఏఎన్ఎస్ఆర్, సత్వాల్, గూగుల్ వంటి పెద్ద సంస్థలు విశాఖకు వచ్చాయన్నారు. పెట్టుబడుల విషయంలో ఏపీ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలతోనే కాకుండా ఇతర దేశాలతో కూడా పోటీ పడుతోందని చెప్పారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ) కేంద్రంగా ఏపీని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఏ జీసీసీ అయినా ఏపీకే రావాలన్నారు.

బుల్లెట్ ట్రైన్ వేగం

ఏపీలో ఉన్నది డబుల్ ఇంజన్ సర్కారు మాత్రమే కాదని, బుల్లెట్ ట్రైన్ వేగంతో దూసుకుపోయే ప్రభుత్వమని లోకేశ్ అభివర్ణించారు. ఎవరైనా పెట్టుబడులు పెట్టడానికి ఢిల్లీ వెళితే... ఏపీకి వెళ్లాలని, అక్కడ వేగంగా నిర్ణయాలు తీసుకునే ప్రభుత్వం ఉందని సూచిస్తున్నారని, అది రాష్ట్రానికే గర్వకారణమని అన్నారు. రైల్వే జోన్ సాధించుకున్నామని, విశాఖ స్టీల్ ప్లాంటు కష్టాల్లో ఉంటే కేంద్రం రూ.11,440 కోట్లు ఇస్తే రాష్ట్రం రూ.4 వేల కోట్ల సాయం అందిస్తోందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో స్టీల్ ప్లాంటు ఒక్క బ్లాస్ట్ ఫర్నేస్‌తో నడిస్తే ఇప్పుడు 3 బ్లాస్ట్ ఫర్నేసులతో 85% ఉత్పత్తి చేసే స్థాయికి చేరిందని తెలిపారు. మరో 3 నెలల్లో విశాఖకు మరిన్ని పెట్టుబడులు వస్తాయని చెప్పారు. విశాఖ అభివృద్ధికి రాష్ట్ర మంత్రివర్గం బ్లాంక్ చెక్ ఇచ్చిందని, దాంతో దూకుడుగా వెళ్తున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు సిఫీ రూ.1,500 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. వెయ్యి మందికి ఉపాధి లభిస్తుంది. తొలిదశలో 50 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ ఏర్పాటు చేస్తారు.



సిఫీ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న లోకేశ్

4 జిల్లాలతో గ్రేటర్ విశాఖ

ఎకనమిక్ జోన్: లోకేశ్

ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం నుంచి అనకాపల్లి వరకు 4 జిల్లాలతో 'గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్' ఏర్పాటు చేస్తున్నామని మంత్రి లోకేశ్ వెల్లడించారు. ఆదివారం విశాఖ కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడారు. 'మహా విశాఖ ఆర్థిక మండలి' నిర్వహణ, విధివిధానాలపై సీఎం ప్రకటన చేస్తారని చెప్పారు. పరిశ్రమలు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించే నాటికి రోడ్లు, ఇతర వసతులు కల్పించాలని ఆదేశించారు. ఉత్తరాంధ్రలో ఏర్పాటుకానున్న పరిశ్రమలు, కంపెనీల ద్వారా 5లక్షల మందికి ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. రాష్ట్రానికి వచ్చిన రూ.లక్ష కోట్ల పెట్టుబడుల్లో సగం గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్‌కు వచ్చాయన్నారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలంటే గ్రేటర్ జోన్ ఆర్థిక వృద్ధి ట్రిలియన్ డాలర్లకు చేరుకోవాలన్న లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించామని వివరించారు. వచ్చేనెల 14, 15ల్లో విశాఖలో జరగనున్న పెట్టుబడుల సదస్సులో మరిన్ని కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంటామన్నారు. మంగళవారం సీఎం చంద్రబాబు ఢిల్లీ వెళ్లి గూగుల్‌తో ఒప్పందం కుదుర్చుకోనున్నారని చెప్పారు. గూగుల్ సంస్థ ద్వారా దేశంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడి ఇదేనన్నారు. టీసీఎస్‌కు కేటాయించిన భూముల్లో వచ్చే నెలలో శంకుస్థాపన జరుగుతుందని చెప్పారు. డిసెంబరులో కాగ్నిజెంట్ ప్రాజెక్టు శంకుస్థాపనకు సీతావో వస్తున్నారని తెలిపారు. దేశంలో అతిపెద్ద ఉక్కు పరిశ్రమ ఉమ్మడి విశాఖలో ఏర్పాటుకాబోతున్నదన్నారు.

ధ్యానంతో సమస్యలకు పరిష్కారం

అత్తిలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అంగర గ్రామానికి చెందిన పిరమిడ్ మాస్టర్ ఎస్.పాపారావు అన్నారు. అత్తిలిలో దానం వెంకట ప్రసాద్ (పెద్ద తాతయ్య) గృహం వద్ద ధ్యానంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పాపారావు మాట్లాడుతూ శ్వాస అనే యజ్ఞం మనిషిలోని చెడును పారద్రోలుతుందని అన్నారు. బాధల నుంచి విముక్తి పొందాలంటే ధ్యానం ఒక్కటే మార్గమని అన్నారు.

17న తణుకులో యువజనోత్సవాలు

భీమవరం టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న తణుకులో జిల్లా యువజనోత్సవములు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పోటీలలో గెలుపొందిన వారిని జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు, రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయిలో జరిగే జాతీయ యువజనోత్సవాలకు పంపిస్తామన్నారు. జిల్లా స్థాయి పోటీ అంశాలలో భర తనాట్యం, కూచిపూడి, జానపద నృత్యం (సోలో), వెస్ట్రన్ డాన్స్ (గ్రూపు) ఉంటాయన్నారు.

పాలిథిన్ కవర్లు వాడితే కఠిన చర్యలు

ఆకివీడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం పై ప్రభావం చూపుతూ, పర్యావరణానికి నష్టం కలిగిస్తున్న పాలిథిన్ కవర్లను నిషేధించి గుడ్డ సంచులు వినియోగించాలని టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం ఉమా, నగర పంచాయతీ మేనేజర్ వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మటన్, చికెన్, కూరగాయలు తదితర దుకాణాల వర్తకులు, వినియోగదారులకు పాలిథిన్ కవర్లు వినియోగం వల్ల జరిగే నష్టంపై అవగాహన కల్పించి గుడ్డ సంచులు అందజేశారు. కొన్ని దుకాణాల దగ్గర ఉన్న పాలిథిన్ కవర్లను స్వాధీనం చేసుకొని జరిమానా విధించారు. అదే విధంగా స్థానిక వివేకానందనగర్ కాలనీ నుంచి మూలలంక బోదె వరకు ఆక్రమణలు తొలగించి కచ్చా డ్రెయిన్ నిర్మాణానికి సోమవారం నుంచి పనులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఆంజనేయులు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు మద్యం విక్రయిస్తే..


దుకాణంలో మద్యం సీసాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ కరుణప్రియ

ఆకివీడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కరుణప్రియ హెచ్చరించారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్‌లు ఆదివారం తనిఖీ చేసి, శాంపిల్స్ తీసుకొని మాట్లాడారు. దుకాణదారులు సిండికేట్‌గా ఏర్పడలేదని, వ్యక్తిగతంగా నిర్వహించుకుంటున్నారన్నారు. తీసుకున్న శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించిన తరువాత నివేదికలో కల్తీ అని తెలితే లైసెన్సులు రద్దుచేసి కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరుగుతుందన్నారు.

గోవులకు వ్యాక్సిన్లు

ఆకివీడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మూగ జీవాల్లో వణికిస్తున్న (చర్మ వ్యాధి) మాయరోగం శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గోశాలలో గోవులకు ఏడీ మల్లేశ్వరరావు ఆదేశాలతో సిబ్బంది వ్యాక్సిన్లు వేశారు. పట్టణంలో తిరుగుతున్న పశువులకు వ్యాక్సిన్ చేస్తామన్నారు. పాడి రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు.

వృద్ధులకు వైద్య సేవలు

తణుకు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా వృద్ధులకు వైద్య సేవలు అందించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుత రామయ్య ఆదివారం తణుకు, వేల్పూరు, కావలిపురం గ్రామాల్లో పర్యటించి పదిమంది వృద్ధులకు ఉచితంగా వైద్య సేవలందించారు. సభ్యులు గోదావరి మాణిక్యాలరావు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణే లక్ష్యం


మాట్లాడుతున్న సత్తి షణ్ముఖ రాజేష్ రెడ్డి

పెనుగొండ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): హిందు ధర్మ పరిరక్షణ కోసం ఆర్ఎస్ఎస్ అవిశ్రాంతంగా కృషి చేస్తుందని పెనుగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ బడేటి వీరబ్రహ్మం అన్నారు. సిద్ధాంతం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం ఆధ్వర్యంలో విజయదశమి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయుధ పూజ నిర్వహించారు. వాసవి శాంతి ధామ్ ప్రధాన అర్చకులు శిష్టా మణికంఠ శర్మ మాట్లాడుతూ నేడు హిందూ సమాజం సుసంఘటితమైన పునర్నిర్మితం కావాలన్నారు. స్వదేశీ జాగరణ మంచ్ రాష్ట్ర సహ కన్వీనర్ సత్తి షణ్ముఖ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ప్రారంభమై నేటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తరుణంలో దేశ వ్యాప్తంగా శతాబ్ది ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో చింతాకుల గోపాలకృష్ణ, సానబోయిన ఉర్దన్న, ఏడిద సూర్య పవన్, బిరుదుగంటి సుబ్రహ్మణ్యం, మామిడిశెట్టి ఆంజనేయులు, రమణమ్మ, గుడి విజయ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో వామపక్షాలతో కలిసి కాంగ్రెస్ పోటీ

గణపవరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వామపక్షాలతో కలిసి పోటీ చేస్తుందని పశ్చిమగోదావరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు అన్నారు. పిప్పర పార్టీ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వామపక్షాలతో కలిసి కాంగ్రెస్ పార్టీ పోటీ చేసేందుకు నిర్ణయాత్మక శక్తిగా కాంగ్రెస్ పార్టీ మారుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ప్రతి గ్రామంలో నాయకులు సమన్వయంతో పని చేయాలన్నారు. బీజేపీ ఓటు చోరిని ప్రజలకు స్పష్టంగా వివరించేందుకు ఓటు సంతకాల సేకరణ ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తమతమ డిక్లరేషన్‌తో సంతకాల ద్వారా తెలియజేయాలన్నారు.

మహిళపై దాడి చేసిన ఐదుగురిపై కేసు

అత్తిలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అత్తిలి సాలిపేటలో గల కొమ్మలపాటి కనకదుర్గ అనే మహిళను మొక్కల విషయంలో గొడవపడి కొట్టారన్నారనే ఆరోపణపై అదే పేటకు చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు అత్తిలి హెడ్ కానిస్టేబుల్ బి.శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సాలిపేటలోని కనకదుర్గ ప్రభుత్వ హాస్టల్లో అటెండర్‌గా పనిచేస్తోంది. మొక్కల విషయంలో గత పది రోజులుగా తిరుపతి గాయత్రి మరో నలుగురు గొడవ పడుతున్నారు. శనివారం సాయంత్రం కనకదుర్గ ఇంటి కాంపౌండ్‌లోకి ప్రవేశించి కొట్టారని తెలిపారు. గొడవ జరిగే సమయంలో కనకదుర్గ భర్త ఇంట్లో లేడని తెలిపారు. గాయపడిన ఆమె తణుకు ఆసుపత్రిలో చేరగా అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు.

కొత్తబస్టాండ్‌కు రాని బస్సులు


బస్సుల కోసం నిరీక్షిస్తున్న మహిళలు

ఆకివీడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు ఆర్టీసీ కొత్త బస్టాండుకు పూర్తి స్థాయిలో బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉండిలో రైల్వేగేటు దగ్గర పిల్లర్‌పై ఐరన్ గ్రిల్స్ పనుల నిమిత్తం శుక్రవారం నుంచి ఈ నెల 17 వరకు గేటు బంద్ చేశారు. దీంతో ఉండి నుంచి ఆకివీడు వైపు రాకపోకలు నిలిచాయి. ఆర్టీసీ అధికారులు భీమవరం, ఏలూరు డిపోలకు చెందిన ఎక్స్‌ప్రెస్‌లు భీమవరం నుంచి ఉండి, గణపవరం, నారాయణపురం మీదుగా ఏలూరు రాకపోకలు సాగిస్తున్నారు. ప్యాసింజర్లు కాళ్ళ, ఏలూరుపాడు మీదుగా ఆకివీడు పాత బస్టాండు నుంచి కొత్త బస్టాండ్‌కు వచ్చి వెళుతున్నాయి. అయితే ఒక్కో పాసింజర్ బస్సు కొత్త బస్టాండ్‌కు రాకుండా వెళ్ళిపోతున్నాయి. స్త్రీశక్తి పథకం ప్రవేశపెట్టిన తరువాత బస్సులు సరిపోక ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్‌కు ఆటోలో వెళ్లాల్సి వస్తుంది. బస్సులకు టిక్కెట్లు ఫ్రీ అయినా ఆటోలకు రానుపోనూ నగదు డబుల్ చెల్లించక తప్పడంలేదని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. ఎక్స్‌ప్రెస్‌లను కూడా ఆకివీడు మీదుగా నడపాలని, అం తే కాకుండా పాసింజర్లు పూర్తిగా కొత్త బస్టాండ్‌కు వచ్చేలా సంబంధిత అధికారులు చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

స్టీమర్‌రోడ్‌లో అఖండ అన్నసమారాధన

నరసాపురం టౌన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టీమర్ రోడ్‌లో పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా జరిగిన ఈ అన్న సమారాధనలో సుమారు 3వేల మంది భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాలు స్వీకరించారు. అలయ కమిటీ సభ్యులు మహిళలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు.

భీమవరం టౌన్: భీమవరం నాచువారి సెంటర్‌లోని కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రుల మహోత్సవాలు ముగింపు సందర్భంగా అన్న సమారాధనను ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. ముందుగా మహా నివేదనకు హారతులు ఇచ్చి పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీక రించారు.

న్యాయమూర్తిపై దాడియత్నానికి ఖండన

ఆచంట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):పెనుమంచిలిలో ఆదివారం ఎంఆర్‌పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం దిగుమర్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పలువురు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి పీఆర్ గవాయ్‌పై దాడియత్నాన్ని ఖండిస్తూ దాడి చేసిన లాయర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రత్నంరాజు, పలివెల పైడియ్య, కనపాల పెద్దిరాజు, తొత్తరమూడి శ్రీనివాసు, చదలవాడ మనోహర్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ రీజియన్ చైర్మన్ మదన్‌మోహన్ అగర్వాల్ మనుమరాలు ఖుషి లీక్ పుట్టిన రోజు సందర్భంగా ఐదుగురు పేద బ్రాహ్మణులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందించారు. తిమ్మరాజుపాలెం మానసిక వికలాంగుల ఆశ్రమంలో దివ్యాంగులు, వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. తాడేపల్లిగూడెంలోని మదన్‌మోహన్ అగర్వాల్ నివాసం వద్ద తాడేపల్లిగూడెం లయన్స్‌క్లబ్ అధ్యక్షులు చిన్నం మనీంద్ర ఆధర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్‌పర్సన్ సుంకర శ్రీనివాస్, కార్యదర్శి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

నిఘా కెమెరాల ఏర్పాటుకు విరాళం అందజేత


చెక్కు అందిస్తున్న ఆర్ఆర్ఆర్

పాలకోడేరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మోగల్లు గ్రామానికి చెందిన పెన్మెత్స సుబ్రహ్మణ్యంరాజు పాలకోడేరు మండలంలోని సీసీ కెమెరాల ఏర్పాటుకు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుకు రూ.5 లక్షలు అందించారు. ఆకివీడు సీఐకు రఘురామకృష్ణంరాజు ఆదివారం ఆ చెక్కును అందించారు. రూ. 5 లక్షల చెక్కు ఇచ్చిన సుబ్రహ్మణ్యంరాజును రఘురామకృష్ణంరాజు అభినందించారు. పాలకోడేరు సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు కొత్తపల్లి నాగరాజు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వద్దు

తాడేపల్లిగూడెం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):ఆరోగ్యం పట్ల ఎవ్వరూ నిర్లక్ష్యం వహించవద్దని క్రైడెన్స్ సొసైటీ అధ్యక్షుడు, లయన్స్‌క్లబ్ జిల్లా పూర్వ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు కోరారు. తాడేపల్లిగూడెం డైమండ్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెంటల్ హెల్త్‌పై అవగాహన సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆదివారం మాణిక్యాలరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక యుగంలో ఇంటర్నెట్ వల్లే కాక అలవాట్లు, నిద్రలేమి, పనివత్తిడి, పోటీతత్వం చెడు వ్యసనాల వల్ల మానసిక ఆందోళనలు పెరిగి ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయన్నారు. మానసిక ప్రశాంతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి డైమండ్స్ లయన్స్‌క్లబ్ అవగాహన సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఆదిలక్ష్మి ఆలయ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

భీమవరం టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గునుపూడి గ్రామదేవత శ్రీఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవార్ల దేవస్థాన నూతన పాలకవర్గ సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. దేవస్థాన చైర్మన్‌గా భీమనాథం వీర శేషారావు, సభ్యులుగా కుతాడి సుజాత, వీరవల్లి ఉమా మహేశ్వరరావు, మైలవరపు మణికంఠ శర్మ, యాతం నాగలక్ష్మి, గరగపర్తి మల్లేశ్వరరావు, సారిక కరుణ, అడబాల శ్రీవాణిలచే ఆలయ ఈవో తోట శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) పాలకవర్గాన్ని అభినందించారు.


ఛాంబర్స్ వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

నాణ్యమైన విద్యను అందించడం అభినందనీయం

పాలకొల్లు టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఛాంబర్స్ కళాశాలలో అతితక్కువ ఫీజులతో అందించడం అభినందనీయమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. కె.వి.ఎం.ఛాంబర్స్ జూనియర్ కళాశాల, బి.ఆర్.ఆర్. అండ్ జి.కె.ఆర్. ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాల స్వర్ణోత్సవ పెరల్ జూబ్లీ వేడుకలలో కేంద్ర మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెరల్ జూబ్లీ బ్లాకుకు కేంద్రమంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బంగారు ఉషారాణి, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, ప్రముఖ సినీ గేయ రచయిత చేగొండి అనంతశ్రీరామ్, కళాశాల చైర్మన్ కారుమూరి వెంకటరత్న నరసింహరావు, సెక్రటరీ కె.వి.సీతారామరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం ఎల్ అగ్రహారం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆచూకి తెలియని వ్యక్తి మృతి చెందినట్టు రైటర్ జిలాని ఆదివారం తెలిపారు. జాతీయ రహదారిపై మృతి చెందిన 35 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి టీషర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. అతని ఆచూకి తెలిసిన వారు 9440796612కు సమాచారం ఇవ్వాలని కోరారు.


జిన్నూరుపాలెం రోడ్డుకు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రామానాయుడు

రూ.6.80కోట్లతో జిన్నూరు అభివృద్ధి

పోడూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే జిన్నూరు గ్రామంలో రూ.6కోట్ల 80లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఆదివారం జిన్నూరు హైస్కూల్‌లో రూ.23లక్షలతో చేపట్టనున్న కెమిస్ట్రీ ల్యాబ్‌కు, మరో 2.55కోట్లతో చేపట్టనున్న జిన్నూరుపాలెం రోడ్డుకు మంత్రి రామానాయుడు శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ వచ్చే మే నెల నాటికి వంతెనం అప్రోచ్ రోడ్డు నిర్మాణం, అన్నపూర్ణమ్మ పేట నరసాపురం కెనాల్‌పై ఫుట్‌పాత్ వంతెనం నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. సమావేశానికి ఏఎంసీ వైస్‌చైర్మన్ దాసరి రత్నరాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సబ్బితి సుమంగళి, సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి, జిన్నూరు సొసైటీ చైర్మన్ దేవళ్ల ప్రసాదు, పాలకొల్లు డీసీ వైస్ చైర్మన్ దేవళ్ల శ్రీరామకోటి మోహన్, బీజేపీ కృష్ణాజిల్లా ఇన్‌చార్జి ఉన్నమట్ల కబర్ధి, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు పెన్మెత్స కాశీవిశ్వనాధరాజు, నీటిసంఘం అధ్యక్షులు కుక్కల సత్యనారాయణ, గుబ్బల శ్రీరామ్, మండల టీడీపీ అధ్యక్షుడు రుద్రరాజు రమేష్‌రాజు పాల్గొన్నారు.

'కొత్త ఉదయం' పుస్తకావిష్కరణ

కాళ్ల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ న్యాయవాది శ్రీ పావని రచించిన 'కొత్త ఉదయం' అనే పుస్తకాన్ని ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. బాలల హక్కులపై రాయబడిన ఈ పుస్తకాన్ని చదివి రచయితను అభినందించారు. బాలల హక్కులపై అవగాహన కోసం విద్యార్థులకు ఈ పుస్తకం ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఈ పుస్తకాన్ని ఉచితంగా ఇస్తున్నట్లు రచయిత్రి శ్రీపావని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి నాగరాజు, కొండా సత్య, వీరవల్లి శ్రీనివాసరావు, వేముల మురళి, స్నేహిత తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీలు ప్రారంభం

భీమవరం టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్ పోటీలు భీమవరం వన్ టౌన్‌లోని జి. వి.ఆర్. కళ్యాణ మండపంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. భీమవరం చెస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భాన్ని పురస్కరించుకుని పోటీలను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర చదరంగం అసోసియేషన్ కార్య దర్శి సుమన్, గ్రంధి శ్రీనివాస్ తనయుడు గ్రంధి రవితేజలు పోటీలను ప్రారంభించారు. కే.జీ.ఆర్. కళాశాల కోశాధికారి గన్నాబత్తుల శ్రీనివాస్, మాజీ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరేటి ప్రకాష్, అనసూయ చెస్ అకాడమి నిర్వాహకులు మాదాస్ కిషోర్ పాల్గొన్నారు.


ఉచిత వైద్య పరీక్షలు

అత్తిలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అత్తిలిలో ఇండియన్ డిజిట్ పాఠశాలలో పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా భీమవరం వినాయక హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

లంపిస్కిన్ వ్యాధితో గోవులకు నరకయాతన

భీమవరం టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): లంపిస్కిన్ వైరస్ ఇది ఆవులకు ప్రాణాంతకరమైన వ్యాధి. ఈ వ్యాధి ఆవుల నుంచి ఆవులకు మాత్రమే సోకుతుంది. నిజంగా ఈ వ్యాధి వచ్చిన మూగజీవాలు నరకయాతన చూస్తున్నాయని గో-ప్రేమికుడు సుంకరదాసు అన్నారు. చిన్న ఆవు దూడలకు లంపిస్కిన్ వైరస్ సోకితే అవి తట్టుకోలేవని, పెద్దవి అయితే తట్టుకునే ఇమ్యూనిటీ శక్తి ఉంటుందని అన్నారు. చిన్న దూడలు వాటి బారిన పడి ఒళ్లంతా పొక్కులుగా వచ్చి ఆ పొక్కులు పగిలి రక్తస్రావాలు కారుతూ విపరీతంగా బాధపడుతూ చనిపోతున్నాయని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికే భీమవరంలో లంపి వైరస్‌తో రోడ్లమీద తిరుగుతున్న ఆవులకు సుంకర దాసు వారి మిత్రబృందం వైద్యం అందిస్తున్నారు. వాటికి హోమి యోపతి ఆయుర్వేదంలో మంచి ఫలితం ఉందని తెలియజేశారు. రోడ్లమీద ఆవులను వదలరాదని లంపీ వైరస్ వచ్చిన ఆవులను గుర్తించి వాటిని దూరంగా ఉంచమని మునిసిపాలిటీ అధికారులను కోరారు.

ఉండిలో వర్షం



ఉండి, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): ఉండిలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షంతో రహదారులు అధ్వానంగా మారాయి. చుట్టు పక్కల భీమవరం, గరగపర్రు తదితర ప్రాంతాలలో కూడా వర్షం కురిసింది. ఉప్పులూరు నుంచి యండగండి వెళ్లే రహదారి, ఉండి, నుంచి వాండ్రం వెళ్లే ఆర్అండ్ రహదారులు గోతులమయంగా మారాయి. ఉండి నుంచి వెలివర్రు మీదుగా చిలుకూరు నుంచి గరగపర్రు వెళ్లే ఆర్అండ్‌బి రహదారి గోతులమయంగా మారింది. రహదారులు అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గుర్తు తెలియని మృతదేహానికి అంత్యక్రియలు

తణుకు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా గుర్తు తెలియని ఒక వృద్ధుడు మృతి చెందడంతో ఉందుర్తి పాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి సంబంధించి ఎలాంటి గుర్తింపు లభించకపోవడంతో స్థానికులు సమాచారంతో పోలీసులు ఫౌండేషన్ నిర్వాహకులు ప్రసన్నకుమార్ సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు.

మాచేనమ్మకు భక్తుల తాకిడి

ఆచంట, అక్టోబరు 12 (ఆం ధ్రజ్యోతి):జిల్లాలో ప్రశిద్ధి చెంది న పెదమల్లం మాచేనమ్మ అ మ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు అమ్మవారి ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ, చైర్మన్ బోడపాటి బాబులు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బండి ముత్యాలమ్మకు పూజలు

మొగల్తూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):తీర ప్రాంత ప్రజల ఆరాధ్యదేవత ముత్యా లపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆది వారం భక్తులతో కిటకిట లాడింది. మనప్రాంతంతో పాటు సరిహద్దు జిల్లాలైన కృష్ణా, తూర్పు గోదావరి జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి వారి మొక్కుబడులైన దూపహరం, కుంభహరాలను నివేదిం చారు. ఆదివారం వేకువ జామున మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద భక్తులకు కావల్సిన సదుపాయాలను ఈవో మోకా అరుణ్ కుమార్ ఆలయ సిబ్బంది కల్పించారు.

వైభవంగా వారాహి అమ్మవారి నిమజ్జనం



యలమంచిలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దసరా వేడుకలు ముగింపును పురస్కరించుకుని మేడపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన వారాహి అమ్మవారి విగ్రహ నిమజ్జనం ఆదివారం వైభవంగా నిర్వహించారు. డీజేలు, యువత నృత్యాలు, తీన్‌మార్ డప్పులు, బాణసంచా కాల్పులు, వేషధారణలతో వారాహి అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించి అనంతరం వశిష్ఠ గోదావరిలో నిమజ్జనం చేశారు.

గంగాలమ్మకు అలంకరణ

నరసాపురం రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి):ఎల్‌బిచర్ల గ్రామంలో ఆది వారం గంగాలమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూలతో అమ్మవారికి అలంకరణ చేశారు. మోడీ, ఎల్‌బిచర్ల, చామకూరిపాలెం, రాజుల్లంక గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించు కుని పూజలు, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

వీరపేరంటాలమ్మకు ప్రత్యేక పూజలు

ఉండి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వీరపేరంటాలమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో వెలివర్రులో అమ్మవారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

అన్నపూర్ణాదేవికి వెండి మకరతోరణం

భీమవరం టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వరస్వామి దేవస్థానంలోని అన్నపూర్ణ అమ్మవారికి పట్టణానికి చెందిన బొండా వెంకట సుబ్రహ్మణ్యం(బుజ్జి) రూ.30 లక్షలతో తయారు చేసిన వెండి మకర తోరణాన్ని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) చేతుల మీదుగా దేవస్థానానికి అందించారు.

వాసవి ధామ్‌లో హోమాలు



పెనుగొండ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి):పెనుగొండ శ్రీ వాసవి శాంతి ధామ్ క్షేత్రంలో కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి వచ్చిన 13 మంది దంపతులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. క్షేత్రంలో గోమాత పూజ, అభిషేకం దంపతి పూజ, హోమాలు నిర్వహించారు.

1100 కాల్ సెంటర్‌ను వినియోగించుకోండి

భీమవరం టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. అ ర్జీదా రులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయ వచ్చునన్నారు.

విద్యార్థులు రచనల పట్ల ఆసక్తి చూపాలి

భీమవరంటౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రచనల పట్ల ఆసక్తి కనబరచాలని తిరుపతి వెంకటేశ్వర వేదిక్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ రాణి సదా శివరావు మూర్తి అన్నారు. భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం రచయిత సాహితీవేత్త దేవరకొండ బాల సుబ్రహ్మణ్యం రచించిన అష్టాదశ కథ సంపుటి అన్నమయానికి ముందు .. తరువాత పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. రిటైర్డు డీఐజీ పీవీఎస్ రామకృష్ణ మాట్లాడుతూ సాహిత్య విలువలు కాపాడుకుంటే మన సంస్కృతిని కాపాడుకున్నట్లేనని, సాహిత్య రంగానికి మన దేశంలో ఎంతో గుర్తింపు ఉందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు, రచయిత పంపన సాయిబాబాను సత్కరించారు. కార్యక్రమంలో మందిర అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, బాల సుబ్రహ్మణ్యం, ఆర్‌విఎస్‌రాజు, మురళీ కృష్ణ, జవివి శ్రీనివాస్, సరిపిడకల రామారావు, సన్నిధిరాజు చలపతి పాల్గొన్నారు

జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలి

తణుకు రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వేల్పూరు గ్రామంలో నిలిచిపోయిన జల్ జీవన్ మిషన్ పనులను తిరిగి ప్రారంభించాలని కోరుతూ గ్రామ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం సంతకాల సేకరణ ప్రారంభించారు. ఆదివారం పార్టీ గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ఆధ్వర్యంలో సీపీఎం నాయకులు మాట్లాడుతూ పనులు మధ్యలో నిలిచిపోయాయని, ఇప్పుడైనా వాటిని పూర్తి చేయాలని కోరుతూ నాయకులు ఇంటింటికి తిరిగి సంతకాలను సేకరించారు.

జోగయ్యను కలిసిన ఎంపీ పాకా


ఎంపీ పాకాకు వినతి పత్రం అందిస్తున్న జోగయ్య

పాలకొల్లు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లులో మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్యను రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ ఆదివారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. జోగయ్య ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. 90ఏళ్ల ప్రాయంలో ఉత్సాహంగా కనిపిస్తూ సమకాలీన రాజకీయాలపై ఎంతో అవగాహనతో ముందుకు వెళుతున్న జోగయ్యను పాకా అభినందించారు. ఈ సందర్భంగా తాను ఇటీవల నెలకొల్పిన రాష్ట్రీయ జన సంక్షేమ సేన చేపట్టనున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. గోదావరి జిల్లాలు అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయని, ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా గోదావరి జిల్లాలను చిన్నచూపు చూస్తున్నాయని జోగయ్య పాకా దృష్టికి తీసుకువెళ్లారు. నరసాపురం నుంచి సిద్ధాంతం వరకూ గోదావరి ఏటిగట్టును పటిష్టపరిచి రెండు లైన్ల రహదారిగా అభివృద్ధి చేయాలని, ఒంగోలు జాతీయ రహదారి పెరవలి మీదుగా వెళుతున్న జాతీయ రహదారులను కలుపుతూ నరసాపురం కెనాల్ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరిస్తూ జాతీయరహదారిగా గుర్తించాలని, డెల్టా ప్రాంతాల మోడరైజేషన్, నేరుగా విజ్జేశ్వరం నుంచి జిల్లాలోని ప్రతిగ్రామానికి మంచినీరు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీ పాకా సత్యనారాయణకు జోగయ్య సూచించారు.

వ్యాపారాలను దెబ్బతీస్తున్న దందా

(5వ పేజీ తరువాయి)

వెళ్లిపోయారు. ఇప్పుడు ఎక్కడికక్కడ హోల్‌సేల్ వ్యాపారాలు వెలిశాయి. ఒకప్పుడు తాడేపల్లిగూడెం వచ్చే రిటైల్ వ్యాపారులు, వినియోగదారులు తాడేపల్లిగూడెం మార్కెట్ పైనే ఆధారపడేవారు. ఇప్పుడు ఇతర ప్రాంతాల్లోనూ మార్కెట్ విస్తరించింది. కానీ తాడేపల్లిగూడెంలో వ్యాపారులపై వసూళ్ల దందా అధికమైంది.

లైసెన్స్‌లు ఇవ్వడంలోనూ తాత్సారం

ఇతర ప్రాంతాల్లో దుకాణాలు పెట్టుకోవడానికి లైసెన్స్‌లు ఇచ్చేశారు. తాడేపల్లి గూడెంలో మాత్రం ఇప్పటికీ కొందరు వ్యాపారులు లైసెన్స్‌ల కోసం ఎదురుచూస్తున్నారు. వ్యాపారాలపై ఎవరైనా ఫిర్యాదులు చేస్తే ముందుగా వారితో సర్దుబాటు చేసుకోవాలంటూ అధికారులే సూచిస్తున్నారు. ఇటీవల పట్టణానికి చెందిన ఓ వ్యాపారికి లైసెన్స్ మంజూరు చేయడంలోనూ అదే చేశారు. చివరకు ముడుపులు చెల్లించి సర్దుబాటు చేసుకున్న తర్వాతే అధికారులు లైసెన్స్ ఇచ్చారు. ఇటువంటి దందాలు ఈ మధ్యకాలంలో తాడేపల్లి గూడెం వ్యాపార రంగంలో పెచ్చుమీరిపోతున్నాయి.ముందుగా దందాబాబులను సంతృప్తి పరచాల్సి వస్తోంది. ఇప్పటికీ బాణసంచా వ్యాపారంలో కొందరికి లైసెన్స్‌లు మంజూరు చేయకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారు. తాడేల్లిగూడెం మార్కెట్‌పై ఇటువంటి సంఘటనలు పెద్ద ప్రభావాన్నే చూపుతున్నాయి.